ప్రజాశక్తి
సోమవారం 3 జూన్ 2024 5
అనంతపురం



పెద్దపప్పూరు ఎస్ఐ సస్పెన్షన్ ..?

ప్రజాశక్తి - పెద్దపప్పూరు

పెద్దపప్పూరు ఎస్ఐ శరత్‌చంద్రను సస్పెండ్ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. తాడిపత్రి స్వతంత్ర అభ్యర్థి సోమేశ్వర నాయుడు పెద్దపప్పూరు మండలంలో తలదాచుకోగా అతని ఆచూకీ కనుగొనక పోవటంలో విఫలమైనందుకు ఎస్ఐపై సస్పెన్షన్ వేటు వేసినట్లు తెలిసింది. తాడిపత్రి స్వతంత్ర అభ్యర్థి సోమేశ్వరనాయుడు నియోజవర్గ బహిష్కరణకు గురికాగా ఆయనను తాడపత్రి పట్టణంలో పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఇన్ని రోజులు ఆయన పెద్దపప్పూరు మండలంలో తలదాచుకున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు తెలిసింది. సోమేశ్వరనాయుడు పెద్దపప్పూరు మండలంలో తలదాచుకున్న సమాచారం తెలుసుకోవటంలో ఆ మండల ఎస్ఐ విఫలమయ్యారని ఈ నేపథ్యంలో ఎస్పీ ఆదేశాల మేరకు ఆయనను సస్పెండ్ చేసినట్లు సమాచారం.



బొమ్మనహాల్ మండలంలో నీటమునిగిన పత్తిపంట



విడపనకల్లు మండలంలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు

'అనంత'లో గాలివాన బీభత్సం

నేలకొరిగిన చెట్లు, విద్యుత్‌స్తంభాలు
నీటి మునిగిన పంట పొలాలు



కొత్తచెరువు మండలంలో రోడ్డుపై విరిగిపడిన చెట్టు

ప్రజాశక్తి - అనంతపురం

అనంతపురం జిల్లాలో శనివారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. పలుమండలాల్లో చెట్లు, విద్యుత్‌స్తంభాలు నేలకొరిగాయి. పంటలు నీట మునిగాయి. అనంతపురం జిల్లాలోని బొమ్మనహాల్, ఉరవకొండ, బెళుగుప్ప, విడపకల్లు తదితర మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. శ్రీసత్యసాయి జిల్లాలో కొత్తచెరువు, పుట్టపర్తి మండలాల్లో వర్షం కురిసింది. శనివారం రాత్రి వచ్చిన గాలివానకు పలుచోట్ల నష్టం వాటిల్లింది.

బొమ్మనహాల్ : శనివారం రాత్రి బొమ్మనహాల్‌లో కురిసిన వర్షానికి 22.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. పలుగ్రామాల్లో రైతులు సాగు చేసిన పత్తి, మొక్కజొన్న, సజ్జ తదితర పంటలు నీటమునిగియా. మండలంలోని, ఎలంజి, కులగానహళ్లి, శ్రీధర్ గట్ట గ్రామాల్లో రైతులు సాగుచేసిన పత్తి, మొక్కజొన్న, సజ్జ తదితర పంటలు నీటమునిగాయి. భారీ వర్షానికి వేదవతి నది పరుగులు తీసింది. పంట పొలాలపై వరద నీరు రావడంతో కోతకొచ్చిన పత్తి పంట నీట మునిగి అపార నష్టం వాటిల్లిందని బాధితరైతులు వాపోతున్నారు. అధికారులు గ్రామాల్లో పర్యటించి పంటనష్టాన్ని అంచనా వేసి తమను ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

ఉరవకొండ : ఉరవకొండ నియోజకవర్గ వ్యాప్తంగా శనివారం రాత్రి ఉరుములు,మెరుపులతో కూడిన భారీ వర్షానికి 52.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. విడపనకల్ మండల పరిధిలోని పాల్తూరు, గాజుల మల్లాపురం, హవలిగి, పొలికి తదితర గ్రామాలలో భారీ వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగి ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు,చెట్లు కూడా నేలకొరిగాయి.

కొత్తచెరువు : శనివారం రాత్రి మండలంలో కురిసిన వర్షానికి 42.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. వర్షంతో పాటు గాలి వీచడంతో చెట్లు, విద్యుత్‌స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయి. లోచర్ల చెరువు వద్ద చింత చెట్టు విరిగి పడడంతో పెనుగొండ - కొత్తచెరువు రహదారిలో రాకపోకలు స్తంభించిపోయాయి. అలాగే మరుకుంటపల్లి వద్ద రోడ్డు మీద చెట్లు పడడంతో తలమర్లకు వెళ్లే రహదారి స్తంభించిపోయింది అలాగే పెనుగొండ రోడ్డులో రైల్వే బ్రిడ్జి కింద నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కొత్తచెరువులో విద్యుత్తు తీగలపై కొబ్బరి చెట్టు పడడంతో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.

పుట్టపర్తి అర్బన్ : శ్రీసత్యసాయి జిల్లాలోని 32 మండలాలకు గాను ముదిగుబ్బ మండలం మినహా అన్ని మండలాల్లో శనివారం రాత్రి ఒక మోస్తారు వర్షం కురిసింది. రెవిన్యూ గణంకాల లెక్కల ప్రకారం జిల్లా వ్యాప్తంగా 632.4 వర్షపాతం నమోదయింది. అత్యధికంగా కనగానపల్లిలో 54.2 మిల్లీమీటర్లు, చిలమత్తూరు మండలంలో 51.2 మిల్లీమీటర్లు, ఎన్‌పి కుంటలో 44.2, కొత్తచెరువు మండలంలో 42.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. తలుపులలో అత్యల్పంగా 2.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. మిగతా మండలాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. మంచి అదనులో వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షం వల్ల దాదాపు జిల్లా అంతటా ఖరీఫ్ సీజన్ లో సాగుకు భూములను దుక్కి దున్నేందుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. ఈ ఏడాది బాగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో బీడు భూములు, పంటలతో పచ్చగా ఉంటుందని రైతులు భావిస్తున్నారు.

కౌంటింగ్‌కు కౌంట్‌డౌన్



రేపే ఓట్ల లెక్కింపు
ఏర్పాట్లు పూర్తి



అనంతపురంలో జెఎన్‌టియులో కౌంటింగ్ ఏర్పాట్లు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కౌంటింగుకు కౌంట్‌డౌన్ మొదలైంది. మరికొన్ని గంటల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. గడిచిన 20 రోజులుగా ఓట్ల ఫలితాల కోసం సాగుతున్న నిరీక్షణకు తెరపడనుంది. ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లను ఇప్పటికే అధికార యంత్రాగం పూర్తి చేసింది. అనంతపురం జిల్లాకు సంబంధించి అనంతపురం జెఎన్‌టియులోనూ ఓట్ల లెక్కింపు జరుగుతుండగా సత్యసాయి జిల్లాకు సంబంధించి హిందూపురం లేపాక్షిల్లో ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలున్నాయి. వీటికి మే 13న పోలింగ్ జరిగింది. మంగళవారం నాడు ఆయా ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు జరగనుంది.

పూర్తి అయిన ఏర్పాట్లు : అనంతపురం, సత్యసాయి జిల్లాలో రెండింటిలోనూ ఓట్ల లెక్కింపు మంగళవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి ప్రారంభం కానుంది. దీనికి సంబంధించి ఏర్పాట్లు సర్వం సిద్ధమయ్యాయి. సత్యసాయి జిల్లా పరిధిలో 11,92,287 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఓట్ల లెక్కింపునకు 750 మంది సిబ్బందిని నియమించారు. అనంతపురం జిల్లా పరిధిలో ఎనిమిది అసెంబ్లీ, అనంతపురం పార్లమెంటు నియోజకవర్గముంది. ఇక్కడ 16,36,315 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఓట్ల లెక్కింపునకు 954 మంది సిబ్బందిని నియమించారు. ఆయా పోలింగు కేంద్రాల్లోనూ ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉదయం ఎనిమిది గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమయ్యే విధంగా అధికారులు ఏర్పాట్లు చేశారు. సాయంత్రంలోపు ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొత్తం పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టామని అధికార యంత్రాంగం చెబుతోంది.

కట్టుదిట్టమైన భద్రత : ఓట్ల లెక్కింపు సమయంలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లను పోలీసులు చేపట్టారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో పెట్టారు. ఎన్నికల సమయంలో అల్లర్లకు ప్పాలడితే కఠిన చర్యలుంటాయని అనంతపురం జిల్లా ఎస్పీ గౌతమి శాలి వెల్లడించారు. అనుమానిత వ్యక్తులపై నిఘా పెట్టినట్టు తెలిపారు. ఈ సమయంలో ప్రత్యేకంగా 274 ప్రాంతాల్లో కొత్తగా సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. ఫలితాల సమయంలో ఎక్కడ ఎటువంటి ఘటనలు చోటు చేసుకున్నా అణచివేయడానికి పోలీసు బలగాలతో పాటు కేంద్ర బలగాలు వచ్చాయి. ముందస్తు అనుమతులున్న వారినే పోలింగు కేంద్ర పరిసరాల్లోకి అనుమతిస్తారు. ఫలితాల అనంతరం ప్రదర్శనలను కూడా నిషేధించారు.



బిట్ కళాశాల కౌంటింగ్ కేంద్రంలో అధికారులకు సూచనలిస్తున్న సత్యసాయి జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు

ఆర్టీసీ ఉద్యోగుల తొలగింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో ఎన్నికల ఉల్లంఘన పేరుతో కొందరు ఆర్‌టిసి ఉద్యోగులు, కార్మికులపై విధించిన సస్పెన్షన్, తొలగింపులు ఉపసంహరించుకుని వారిని యధావిధిగా విధుల్లోకి తీసుకోవాలని కార్మిక, కర్షక, ప్రజా, ఉద్యోగ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆర్‌టిసి ఉద్యోగులపై అక్రమ సస్పెన్షన్‌లు రద్దు చేయాలన్న డిమాండ్‌తో ఆదివారం స్థానిక జెవివి జిల్లా కార్యాలయంలో సిఐటియు ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రాజేష్ గౌడ్, ఎపి ఎన్‌జిఒ నగర అధ్యక్షులు మనోహర్ రెడ్డి, ఏపీ మున్సిపల్ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం, ప్రజా ఆరోగ్య వేదిక కార్యదర్శి అధ్యక్ష కార్యదర్శులు ఏజీ.రాజమోహన్, శ్రీనివాసరావు, మెడికల్ సేల్స్ రెప్రజెంటివ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మనోహర్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాల రంగయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, కోపరేటివ్ సొసైటీ ఉద్యోగుల కార్మిక సంఘం నాయకులు శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ పరిధిలో లేని అంశాన్ని ఆధారంగా చేసుకొని ఆర్‌టిసి కార్మికుల యూనియన్ నాయకులైన ఎస్‌డబ్ల్యూఎఫ్, ఎన్‌ఎంయు, బహుజన కార్మిక సంఘం సుందరయ్య, శ్యామ్, సుబ్బారావులను సస్పెండ్ చేయడం అప్రజాస్వామికమని అన్నారు. చిన్న కారణాలతో ఆర్‌టిసి ఉద్యోగులను సస్పెన్షన్‌లు చేయడం, తొలగించడం తగదన్నారు. వేధింపులు ఆపకపోతే ఆద్యోగ సంఘాలు ఉద్యమించక తప్పదని హెచ్చరించారు. పౌరులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను హరించే రీతిలో కమిషన్ వ్యవహరించడం సరికాదన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు ఐక్య ఉద్యమాలకు శ్రీకారం చుట్టాల్సిన బాధ్యత కార్మిక సంఘాలపై ఉందని గుర్తు చేశారు. ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రాజేష్ గౌడ్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై మాట్లాడం ఎన్నికల నియమావళిలోకి రాదన్నారు. ఉద్యోగుల హక్కులపై దాడి తప్ప మరొకటి కాదన్నారు. సందరయ్యను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కోఆపరేటివ్ ఉద్యోగుల సంఘం నాయకులు శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు పేరుతో ఉద్యోగులను సస్పెండ్ చేయడం మానసికంగా వేధించడమే అవుతుందన్నారు. ఎన్‌జిఒ నగర అధ్యక్షులు మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు అమలులో ఉండగా, ఎన్నికల కోడ్ పేరుతో ఆర్‌టిసి యాజమాన్యం ఎలా చర్యలు తీసుకుంటుందని ప్రశ్నించారు. తక్షణమే సుందరయ్య అక్రమ సస్పెన్షన్ రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిఐటియు అనంతపురం నగర కార్యదర్శులు వెంకటనారాయణ, ముత్తుజ, మున్సిపల్ కార్మికుల యూనియన్ నగర నాయకులు తిరుమలేష్, ఎర్రిస్వామి, మెడికల్ రెప్స్ సురేంద్ర, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

శాంతియుత వాతావరణంలో కౌంటింగ్



కౌంటింగ్‌కేంద్రం వద్ద ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కలెక్టర్, కమిషనర్, తదితరులు

కలెక్టర్ డాక్టర్. వినోద్ కుమార్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

శాంతియుత వాతావరణంలో కౌంటింగ్ నిర్వహణకు తగిన చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వి. వినోద్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం అనంతపురం నగరంలోని జెఎన్‌టియులో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములను, కౌంటింగ్ కేంద్రాల్లో చేపట్టిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. సాధారణ ఎన్నికల దృష్ట్యా కౌంటింగ్ కేంద్రాలలో ఈ నెల 4వ తేదీన ఉదయం 8 గంటలకు కౌంటింగ్ మొదలవుతుందన్నారు. సాధారణ ఎన్నికల కౌంటింగ్ అబ్జర్వర్లు జిల్లాకు చేరుకోవడం జరిగిందని, కౌంటింగ్ పర్సనల్స్‌కు సంబంధించి రెండు ర్యాండమైజేషన్లు చేయాల్సి ఉందని అన్నారు. ఆదివారం రాత్రి ఒకటి, కౌంటింగ్ రోజు ఉదయం 5 గంటలకు ఒక ర్యాండమైజేషన్ చేస్తామన్నారు. సోమవారం ఎన్నికల కౌంటింగ్ అబ్జర్వర్లు జెఎన్‌టియులోని కౌంటింగ్ కేంద్రాలను పర్యవేక్షణ చేసి అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. పోలీసు వారు డ్రస్ రిహార్సల్స్ చేశారని, కొద్ది రోజుల క్రితం ఫ్లాగ్ మార్చ్ చేశారని తెలిపారు. సోమవారం రోజు అధికారులంతా ఐడి కార్డులతో కౌంటింగ్ కేంద్రంలోకి వెళ్లి రిటర్నింగ్ అధికారుల సమక్షంలో డ్రస్ రిహార్సల్స్ చేస్తారన్నారు. కౌంటింగ్ నేపథ్యంలో జిల్లా అంతా హై అలర్ట్‌లో ఉందని, మండల స్థాయిలో తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూములను ఏర్పాటు చేశామని, అవి 24/7 పనిచేస్తాయని చెప్పారు. జిల్లాలో 315 సమస్యాత్మక గ్రామాలను గుర్తించడం జరిగిందని, ఆయా గ్రామాల్లో గ్రామస్థాయి అధికారులను అప్రమత్తం చేయడం జరిగిందని అన్నారు. గ్రామస్థాయి నుంచి గంటకు ఒకసారి జిల్లా కంట్రోల్ రూమ్‌కి నివేదిక ఇస్తారన్నారు. జిల్లా మొత్తం 270 ప్రాంతాల్లో కంట్రోల్ రూమ్ నుంచి సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగిందని, సీసీటీవీ కెమెరాల నుంచి ఫీడ్ వస్తుందని చెప్పారు. వర్షం వచ్చినా ఇబ్బంది లేకుండా రైన్ ప్రూఫ్ ఏర్పాట్లు చేశామని వివరించారు. దాదాపు 12 నుంచి 1 గంట మధ్యలో ఉరవకొండ అసెంబ్లీ నియోజకవర్గం ఫలితం వస్తుందన్నారు. అనంతపురం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి పోస్టల్ బ్యాలెట్ సంఖ్య ఎక్కువగా ఉందని, వాటి లెక్కింపు 5 నుంచి 6 గంటల దాకా అవుతుందని అది పూర్తయిన తర్వాత అనంతపురం అసెంబ్లీ నియోజకవర్గం ఫలితం వస్తుందని చెప్పారు. దాంతోపాటు పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు సెగ్మెంట్ల ఫలితాలు వస్తాయని, అనంతపురం ఫలితాలు సాయంత్రం 6:30 గంటలు కావచ్చని అన్నారు. అభ్యర్థులకు, ఏజెంట్లకు శిక్షణ కార్యక్రమాలు, సమావేశాలు కూడా ఏర్పాటు చేశామని, నిబంధనలను వివరించామని అన్నారు. కౌంటింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్, రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అందరి చూపు హిందూపురం వైపు..!

♦బాలయ్య హ్యాట్రిక్ సాధించేరా..? ♦పెద్దిరెడ్డి పాచికలు పారేనా..? ♦రేపు ఉత్కంఠకు తెర..



ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్రంలోనే హిందూపురం నియోజక వర్గానికి ఒక ప్రత్యేకత ఉంది. నాటి ఎన్టీఆర్ నుంచి నేటి బాలయ్య వరకు టిడిపికి ఓటమి ఎరుగని కోట ఏదైనా ఉంది అంటే అది హిందూపురం అని ప్రతి ఒక్కరు చెబుతారు. ఓటమి ఎరుగని కోటలో ఈ సారి ఏలాగైనా వైసిపి జెండా ఎగురవేయాలని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. అయితే వెలువడిన ఎగ్జిట్ పోల్స్ సర్వేలన్నీ బాలయ్య వైపు చూపించాయి. దీనిని బట్టి చూస్తే బాలయ్య హ్యాట్రిక్ దిశగా దూసుకు పోతున్నారని ఆపార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రంలోనే ప్రత్యేక అసెంబ్లీ నియోజకవర్గమైన హిందూపురంలో పలు మార్పులు చోటు చేసుకుంటున్నాయి. దీంతో అందరి దృష్టి హిందూపురంపై పడుతోంది. వచ్చే మే నెలలో ఎన్నికలు జరిగినప్పటి నుంచి కౌంటింగ్ వరకు ప్రతి ఒక్కరు హిందూపురం వైపు చూస్తున్నారు. ఎన్నికలకు ముందు నుంచే మంత్రి పెద్ది రెడ్డి రామచంద్రారెడ్డి హిందూపురంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. దీని కోసం బలమైన మైనార్టీ నాయకుడు విశ్రాంత ఐపిఎస్ అధికారిని సైతం ఇక్కడి నుంచి ఇన్‌చార్జ్ బాధ్యతల నుంచి తప్పించి, మంత్రికి అనుకూలమైన వ్యక్తి అయిన వేణురెడ్డి భార్య దీపికను ఇన్‌ఛార్జిగా నియమించడంతో పాటు బిసిలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెరపైకి తెచ్చారు. దీంతో పాటు అన్ని వర్గాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చారు. అందరు కలిసి ఎన్నికల సమయంలో పని చేశారు. అయితే అప్పటికే షేక్ మహమ్మద్ ఇక్బాల్ తన ఎమ్మెల్సీ పదవితో పాటు పార్టీకి రాజీనామా చేయడంతో పాటు వైసిపి మైనార్టీలను మోసం చేసిందని హిందూపురంతో పాటు జిల్లా వ్యాప్తంగా ప్రచారం చేశారు. బాలకృష్ణ, దీపిక ప్రచారాలకు నియోజక వర్గంలో అందరు బ్రహ్మరథం పట్టారు. దీంతో పాటు రెండు పార్టీల వారు ఓటుకు నోట్లు సైతం భారీగానే పంచారు. అయితే అధికార వైసిపిలో కొంత మంది కౌన్సిలర్లు వార్డుల్లో డబ్బులను పంపిణీ చేయకుండా నొక్కేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. దీంతో పట్టణంలో వైసిపికి ఓట్ల శాతం తగ్గి టిడిపికి పెరిగినట్లు తెలుస్తోంది. ఇక లేపాక్షి మండలంలో సైతం టిడిపికే అధికంగా ఓట్లు పడినట్లు తెలుస్తోంది. చిలమత్తూరు మండలంలో అధికార వైసిపికి టిడిపి కన్నా ఎక్కువగా ఓట్లు వచ్చినట్లు వార్తలు వినపిస్తున్నాయి. దీనిని బట్టి చూస్తే బాలయ్య హ్యాట్రిక్ సాధించడం ఖాయం అని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇదే జరిగితే కంచుకోటపై వైసిపి జెండా ఎగర వేయాలన్న పెద్దిరెడ్డి ఆశలు ఆవిరి అయినట్లే. ఏది ఎమైనప్పటికి ఎవరిని విజయం వరిస్తుందో మంగళవారం బిట్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌లో నిక్షిప్తమైన ఈవిఎం లెక్కింపులో తేలనుంది.

శాంతిభద్రతల పరిరక్షణలో రాజీపడొద్దు

సెట్ కాన్ఫరెన్స్‌లో ఎస్పీ గౌతమిశాలి


లాడ్జిలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

శాంతిభద్రత విషయంలో రాజీపడకుండా, టీం వర్క్‌తో ఎవరికి కేటాయించిన విధులు వారు సక్రమంగా నిర్వర్తించాలని ఎస్పీ గౌతమిశాలి పిలుపునిచ్చారు. ఈనెల 4న సాధారణ ఎన్నికల ఫలితాల సందర్భంగా బందోబస్తులో ఉన్న సిబ్బందితో ఎస్పీ ఆదివారం సెట్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాకేంద్రంలోని కౌంటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు సిబ్బంది, తాడిపత్రి, ఇతర సమస్యాత్మక గ్రామాలు, కాలనీల్లో బందోబస్తు నిర్వహిస్తున్న సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల నిబంధనలు అనుసరించి ఉన్నతాధికారులు జారీ చేసిన ఆదేశాలు, ఉత్తర్వులు ప్రకారం నడుచుకోవాలన్నారు. జిల్లా అంతటా 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, నలుగురి కంటే ఎక్కువ మంది గుమిగూడరాదన్నారు. దీనికితోడు 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున అనుమతి లేకుండా ఎవరూ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. అల్లర్లు, గొడవలు, హింసాత్మక ఘటనలకు దూరంగా ఉంటూ ప్రశాంతంగా మెలగాలని ప్రజల్లో చైతన్యం తేవాలన్నారు. బాణాసంచా నిల్వ ఉంచడం, క్రయ, విక్రయాలు చేయడం, కాల్చడం నిషేధమని సూచించాలన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ఓడిన వారి పట్ల కవ్వింపు చర్యలకు పాల్పడడం, హేళన చేయడం, రెచ్చగొట్టడం చేయకుండా చూడాలన్నారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా ఎన్నికల నిబంధనలు పాటించాలని, ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

లాడ్జిలు, హోటళ్లలో విస్తృత తనిఖీలు

ఈనెల 4న కౌంటింగ్ నేపథ్యంలో ఎస్పీ గౌతమిశాలి ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని లాడ్జిలు, హోటళ్లలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా అనుమానితులు, అపరిచితులు లాడ్జిల్లో బస చేసి కౌంటింగు ప్రక్రియ రోజున ఎలాంటి ఘటనలకు పాల్పడకుండా చెకింగ్‌లు చేశారు. అనుమానితులకు ఎట్టి పరిస్థితుల్లో లాడ్జిల్లో గదులు ఇవ్వకూడదన్నారు. ఏవైనా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమస్యాత్మక గ్రామాల్లో సీసీ కెమెరాల నిఘా


మొబైల్ పార్టీ కవాతు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

సాధారణ ఎన్నికల ఫలితాలను దృష్టిలో ఉంచుకుని ఎస్పీ గౌతమిశాలి ఆదేశాలతో జిల్లా అంతటా పోలీసులు దాదాపు 280 నూతన సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటితోపాటు ఇప్పటికే ఏర్పాటు చేసిన 450 కెమెరాలు పని చేయనున్నాయి. ఆయా కెమెరాలను జిల్లాకేంద్రంలోని ఈ సర్వైలెన్స్ సెంటర్‌కు అనుసంధానం చేశారు. సమస్యాత్మక గ్రామాలు, కాలనీలలో ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని పోలీసులు అందుకునేలా, ఘర్షణలు, అల్లర్లు మొగ్గ దశలోనే తుంచేసేలా జిల్లా ఎస్పీ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించారు. సమస్యాత్మక గ్రామాలు, కాలనీలపై ప్రత్యేక దృష్టి సారించి కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతూనే.. మరోవైపు సిసి కెమెరాల ద్వారా పర్యవేక్షించాలనే కార్యాచరణతో ఎస్పీ ముందుకెళ్తున్నారు. ఆయా ఫ్యాక్షన్ ప్రభావిత, సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు పికెట్లు, సంబంధిత పోలీసులు అప్రమత్తంగా ఉన్నప్పటికీ కొత్తగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి మరింత లోతుగా నిఘా పెట్టారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మున్సిపల్ పట్టణాలు, మండల కేంద్రాలలో సమస్యాత్మక కాలనీలు, కూడళ్లు, ప్రధాన రహదారులపై సీసీ కెమెరాలను అమర్చారు. ఏ చిన్న అవాంఛనీయ ఘటనకు పాల్పడినా, అల్లర్లు ఘర్షణలకు దిగినా సిసి ఫుటేజీల్లో నమోదై చట్టపరమైన చర్యలకు గురికావాల్సొస్తుందని ఎస్పీ సూచిస్తున్నారు.

గ్రామాలకు చేరిన మొబైల్ పార్టీలు

కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేందుకు సిద్ధం చేసిన బందోబస్తు ప్రణాళికలో భాగంగా ఏర్పాటు చేసిన మొబైల్ పార్టీలు క్షేత్రస్థాయిలోకి వెళ్లాయి. కౌంటింగ్ రోజు, ఆ తర్వాత ఉన్న నిబంధనల గురించి తెలియజేసేందుకు మొబైల్ పార్టీల సిబ్బంది గ్రామాలకు వెళ్లారు. జిల్లా అంతటా 144 సెక్షన్, 30 పోలీస్ యాక్టులు అమలులో ఉన్నాయని, ఈ ఉత్తర్వుల ప్రకారం నలుగురి కంటే ఎక్కువ మంది ప్రజలు గుమిగూడరాదని, పోలీసుల ముందస్తు అనుమతి లేనిదే ఎలాంటి ర్యాలీలు నిర్వహించరాదని సూచించారు. విజయోత్సవ ర్యాలీలు నిషేధమని తెలిపారు. ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరూ తూచా తప్పకుండా పాటించాలని, ఉల్లంఘిస్తే కేసుల్లో ఇరుక్కుని జీవితాలు నాశనం చేసుకుంటారని హెచ్చరిస్తున్నారు. కౌంటింగు రోజు వరకే కాకుండా ఆ తర్వాత కూడా ప్రశాంతంగా మెలుగుతూ పోలీసులతో సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. టూవీలర్స్, ఫోర్ వీలర్స్‌కు పబ్లిక్ అడ్రెస్సింగ్ సిస్టం ఏర్పాటు చేసుకుని జిల్లా పోలీసుశాఖ కౌంటింగు నేపథ్యంలో ప్రత్యేకంగా సిద్ధం చేసిన రికార్డింగ్ వాయిస్ ద్వారా మొబైల్ పార్టీ బందాలు కేటాయించిన గ్రామాల్లో ప్రజల్లో చైతన్యం తెస్తున్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

డీఎస్పీ బివి.శివారెడ్డి


గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ బివి.శివారెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరు

సార్వత్రిక ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని అనంతపురం రూరల్ డీఎస్పీ బివి.శివారెడ్డి సూచించారు. ఆదివారం మండలంలోని మదిగుబ్బలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు ఎలా వచ్చినా అందరూ సమానంగా స్వీకరించాలన్నారు. అలాకాకుండా గొడవలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాఅంతటా 144 సెక్షన్, 30 పోలీస్ యాక్టులు అమలులో ఉంటాయన్నారు. ఆయా ఉత్తర్వుల ప్రకారం నలుగురి కంటే ఎక్కువ మంది ప్రజలు గుమిగూడరాదన్నారు. పోలీసుల ముందస్తు అనుమతి లేనిదే ఎలాంటి ర్యాలీలు నిర్వహించరాదన్నారు. విజయోత్సవ ర్యాలీలు నిషేధమన్నారు. ఎన్నికల నిబంధనలను ఎవరు ఉల్లంఘించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ప్రశాంత జీవనం సాగించాలి : డీఎస్పీ


కౌంటింగ్ ఏజెంట్లతో మాట్లాడుతున్న డీఎస్పీ బి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

ఎన్నికల నిబంధనలను ఎవరు అతిక్రమించినా కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ బి.శ్రీనివాసులు హెచ్చరించారు. ఆదివారం రూరల్ పోలీస్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో కౌంటింగ్ ఏజెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల అనంతరం గ్రామాల్లో అలజడి సృష్టిస్తే సహించేది లేదన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 144 సెక్షన్ విధించడంతోపాటు పోలీస్ 30 యాక్ట్ అమలులో ఉంటుందన్నారు. కావున బాణాసంచా విక్రయాలతో పాటు పేల్చడం కూడా నేరమన్నారు. రాజకీయ పార్టీ నాయకులు కార్యకర్తలు సమన్వయంతో ఉండాలన్నారు. ప్రజల్లో రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించడంతోపాటు గెలుపు అనంతరం కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే కేసులు బనాయించి రిమాండ్‌కు పంపుతామని హెచ్చరించారు.

గొడవలకు వెళ్లొద్దు..


మాట్లాడుతున్న ఎలక్షన్ కౌంటింగ్ పర్సనల్ అధికారి విజయ భాస్కర్‌రావు

ప్రజాశక్తి-పుట్లూరు

ఎన్నికలు వస్తూ ఉంటాయి..పోతూ ఉంటాయి.. కావున గ్రామాల్లో ప్రతి ఒక్కరూ ఎలాంటి గొడవలకు వెళ్లకుండా ప్రశాంత జీవనం సాగించాలని ఎలక్షన్ కౌంటింగ్ పర్సనల్ అధికారి విజయ భాస్కర్‌రావు సూచించారు. ఆదివారం మండల కేంద్రంతోపాటు కొండాపురం, కడవకల్లు, శనగలగూడూరు గ్రామాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరూ గొడవలకు వెళ్లొద్దన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాకాకుండా గొడవలకు వెళ్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ఎన్నికల కౌంటింగ్‌ను పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. దీనికితోడు 30 పోలీసు యాక్ట్ అమలులో ఉన్నందున ఏ పార్టీ గెలిచినా టపాసులు పేల్చడం, ర్యాలీలు చేయడం, గుంపులు, గుంపులుగా వెళ్లి అల్లర్లకు పాల్పడటం నేరమన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ సుబ్రమణ్యం, ఎస్ఐ హేమాద్రి, పోలీస్‌సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యాసంస్థగా 'శ్రీసాయి ఫ్రెండ్స్'



ప్రతిభ కనబరిచిన విద్యార్థులు



కరస్పాండెంట్ మధు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డులో ఉన్న శ్రీసాయి ఫ్రెండ్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఉత్తమ విద్యాసంస్థగా గుర్తింపు పొందినట్లు పాఠశాల కరస్పాండెంట్ మధు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ 2023-24 విద్యా సంవత్సరం 10వ తరగతి ఫలితాల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లాస్థాయిలో రాణించినట్లు తెలిపారు. పాఠశాలకు చెందిన యం. వర్షిత 583 మార్కులు, కె.మైత్రి 566, ఎస్.అస్రఫ్ మున్నిసా 563, ఎస్.మహమ్మద్ ఆరీఫ్ 548, ఎస్.ఉస్మాన్ పరాగ్ 540, డి.యోజిత 532, ఎం.తరుణ్‌తేజ 530, ఎం.సాయిదీక్షిత 527, ఆర్.అభిషేక్ 527, జె.ప్రవీణ్‌కుమార్ 525, ఎస్.సబిహా 524, డి.మహమ్మద్ 512, బి.సమీరా 510, డి.అమీన్ 501, కె.అమిత్ 500, ఎం.వర్షిణీప్రియ 500, టి.ఎస్.షేక్షావలి 493 మార్కులు సాధించి అత్యంత ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. అంతేగాకుండా పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత సాధించి ఉత్తమ విద్యాసంస్థగా ఖ్యాతి గడించినట్లు వివరించారు. ప్రతిఏటా చదువుతో పాటు అన్నిరంగాల్లో విద్యార్థులు తీర్చిదిద్దుతూ సాయి ఫ్రెండ్స్ విద్యా సంస్థ ముందుకెళ్తోందన్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో 'ఎడిఫై' స్కూల్


సిఇఒ మెరార్డియ, చైర్‌పర్సన్ కామేశ్వరి


విలేకరులతో మాట్లాడుతున్న ఎడిఫై స్కూల్ ప్రతినిధులు

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఎడిఫై స్కూళ్లు ప్రారంభిస్తున్నట్లు ఎడిఫై విద్యాసంస్థల సిఇఒ గౌరవ్ మొరార్డియ, చైర్‌పర్సన్ సి.హెచ్ కామేశ్వరి, ప్రిన్సిపల్ ప్రజిత్‌నాయర్ తెలిపారు. ఆదివారం బుక్కరాయసముద్రం మండలం వడియంపేట వద్ద ఉన్న పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బలరామ్‌నాయుడు ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎడిఫై విద్యాసంస్థ అత్యున్నత ప్రమాణాలతో మీ ముందుకు వచ్చిందన్నారు. సొంత స్థలంలో ప్రపంచ స్థాయి కరికులం అందించే దిశలో ఎడిఫై పాఠశాల అత్యున్నత ప్రమాణాలతో సిద్ధమైందన్నారు. 2003లో హైదరాబాదులో ప్రారంభమై రెండు దశాబ్దాల్లో 200 ప్రైమరీ సెక్షన్ పాఠశాలలను 54వ హైస్కూలింగ్ పాఠశాలగా అనంతపురంలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అత్యున్నత ప్రమాణాలు కలిగిన కేం బ్రిడ్జ్ యూనివర్సిటీ మెటీరియల్ తమ సంస్థ ఉపయోగిస్తున్నట్లు వివరించారు తల్లితండ్రులు ఒకసారి ఆలోచించి పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఎడిఫైని సందర్శించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో అనంతపురం ఎడిఫై డైరెక్టర్లు ప్రవీణ్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

నార్పలలో కిక్కిరిసిన మద్యం దుకాణాలు


కిటకిటలాడుతున్న మద్యం దుకాణం

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని మద్యం దుకాణాలు మందుబాబులతో ఆదివారం కిక్కిరిశాయి. ఈనెల 4న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ఉండటంతో వరుసగా మూడు రోజులు మద్యం దుకాణాలు బంద్ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో మద్యంబాబులు ఆదివారం ఉదయం నుంచే మద్యం దుకాణాల బాట పట్టారు. మండల కేంద్రానికి మద్యం ప్రియులులు భారీగా తరలిరావడంతో నార్పల కొత్త బస్టాండ్ ఆవరణ తిరుణాల వాతావరణాన్ని తలపించింది.

నాణ్యతకు భరోసా.. ఎంజి సిల్వర్ జ్యువెలరీస్


బంగారాన్ని కొనుగోలు చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి-అనంతపురం

నాణ్యతతో పాటు నమ్మకంగా కస్టమర్లకు పూర్తిస్థాయి స్వచ్ఛతతో కూడిన 92.5 సిల్వర్ ఆర్నమెంట్స్ ఎంజీ సిల్వర్ జ్యువెలరీస్ అందిస్తోందని సంస్థ ప్రొప్రైటర్ బి.మంజుల తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆమె మాట్లాడుతూ సుదీర్ఘంగా బంగారు, వెండి ఆభరణాల అమ్మకాల్లో ఉన్న నైపుణ్యంతో ఇటీవల ఆర్ఎస్ రోడ్డులోని పెట్రోల్ బంకు పక్కన ఎంజి సిల్వర్ జ్యువెలరీని ప్రారంభించినట్లు తెలిపారు. తమ వద్ద మగువలు నచ్చే మెచ్చే రీతిలో సిల్వర్ ఆర్నమెంట్స్ అన్ని రకాల సంప్రదాయ వెండి ఆవరణాలు, ముఖ్యంగా వివిధ రకాల బిట్స్ లభిస్తాయని తెలిపారు. అలాగే పూజకు అవసరమైన వెండి సామగ్రి, గృహోపకరణ వెండి సామాగ్రి లభిస్తుందన్నారు. ముఖ్యంగా నేటి యువతకు నచ్చే విధంగా అనేక మోడల్స్ వెండితో తయారు చేసిన ఆభరణాలతోపాటు బంగారు పూతతో తయారు చేసిన వెండి ఆభరణాలు ప్రత్యేకంగా తమ వద్ద లభిస్తాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోస్టల్ బ్యాలెట్‌పై హైకోర్టు తీర్పు హర్షణీయం

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ల చెల్లుబాటుపై హైకోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమని ఎపి రాష్ట్ర ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయ్‌భాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం ఉద్యోగులు వినియోగించుకున్న పోస్టల్ బ్యాలెట్ చెల్లుబాటు అయ్యేలా ఎన్నికల సంఘం సూచించిన నియమావళిని హైకోర్టు సమర్థించడం సంతోషకరమన్నారు. పోస్టల్ బ్యాలెట్‌లో చిన్న చిన్న పొరబాట్లు జరిగాయని, ఓట్లను చెల్లనివ్వకుండా కొన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నాలు చేయటం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ చెల్లుబాటు విషయంలో ఎన్నికల సంఘం చేసిన సూచనలు రాజ్యాంగ బద్ధంగా ఉన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం ఏర్పాటుకు ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్లు చాలా కీలకం కానున్నాయని అభిప్రాయం వ్యక్తం చేశారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వినోద్‌కుమార్, జిల్లా అధికారులు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్, ఎన్నికల అధికారి వినోద్‌కుమార్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఎన్నికల కౌంటింగ్ పనులన్నీ సకాలంలో పూర్తి చేయాలని, అధికారులంతా అత్యంత జాగ్రత్తగా ఉండాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. ఆదివారం అనంతపురం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రిటర్నింగ్ అధికారులతో సాధారణ ఎన్నికల కౌంటింగ్ పనులపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రాల్లో ప్రతి ఒక్క చిన్న పాటి పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. రిటర్నింగ్ అధికారులు అంతా అత్యంత జాగ్రత్తగా ఉండాలన్నారు. సమయానికి అన్ని పనులు జరిగేలా చూసుకోవాలని, కౌంటింగ్ కేంద్రాల్లో రౌండ్లవారీగా ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటనలో రాష్ట్ర యావరేజ్ కన్నా ముందుండాలన్నారు. కౌంటింగ్ తర్వాత చేయాల్సిన ప్రక్రియలు అన్నింటిలో కూడా ముందుగానే పనులు పూర్తి చేసుకోవాలన్నారు. కౌంటింగ్ కేంద్రాలు రిటర్నింగ్ అధికారుల స్వాధీనంలో ఉండాలని, ఏజెంట్లు మొదటిసారి తప్పుగా ప్రవర్తిస్తే, వాయిస్ రైజ్ చేసినా ఎలాంటి మొహమాటలకు పోకుండా నిర్దాక్షిణ్యంగా వ్యవహరించాలని, అలాంటి వారిని బయటకు పంపించాలన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు ఎలాంటి పెన్, పేపర్ తీసుకురాకూడదని, వాటిని కౌంటింగ్ కేంద్రంలో అందించాలన్నారు. ప్రధాన భవనాల వద్ద పార్కింగ్ కోసం కేటాయించిన స్థలాలను పరిశీలించాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో అత్యవసర, ఫైర్ ఎగ్జిట్ ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. మండలాల్లో కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేయాలని, సమస్యాత్మక గ్రామాల్లో ఎలాంటి చర్యలు తీసుకున్నారు అనేది పరిశీలించి, గ్రామాల్లో పరిస్థితి ఎలా ఉంది అనేది గంటకు ఒకసారి సమాచారం మండల కేంద్రానికి ఇవ్వాలని, అక్కడి నుంచి జిల్లా కేంద్రానికి సమాచారం అందించాలన్నారు.

నిత్యావసర వస్తువుల వితరణ



నిత్యావసర వస్తువులను పంపిణీ చేస్తున్న అతిథులు

ప్రజాశక్తి-అనంతపురం

ప్రగతి పథం యూత్ అసోసియేషన్, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రాకేష్ వృద్ధాశ్రమంలో నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాతీయ యువజన అవార్డు గ్రహీత బిసాటి భరత్ మాట్లాడుతూ ప్రగతి పథం యూత్ అసోసియేషన్ సాంకేతిక నిపుణులు గుజ్జల సిద్ధు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని రాకేష్ వృద్ధాశ్రమంలో ఉన్న అవ్వాతాతలకు నిత్యావసర వస్తువుల పంపిణీ చేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం అర్బన్ బ్యాంకు డైరెక్టర్ సుంకర రమేష్, బిజినెస్‌మెన్ రఘు, అరుణ్ ఐస్ క్రీమ్ డిస్ట్రిబ్యూటర్ రాఘవేంద్రయాదవ్, ప్రగతి పథం యూత్ అసోసియేషన్ సభ్యులు కిరణ్‌సాయి, రాజ, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'పెన్నోబిలం' ఆలయంలో హుండీ లెక్కింపు

వజ్రకరూరు : పెన్నోబిలం లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో సోమవారం స్వామివారి హుండీ ఆదాయాన్ని లెక్కించనున్నట్లు దేవస్థాన ఇఒ కె.విజయ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు లెక్కింపు ఉంటుందన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా హుండీలో భక్తులు సమర్పించిన నగదు, కానుకలను లెక్కిస్తున్నట్లు ఇఒ తెలిపారు.

పూర్వ విద్యార్థుల కలయిక


ఒకచోట చేరిన పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1986-87లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఒక్కచోట కలిశారు. అప్పట్లో విద్యాబోధన చేసిన గురువులతో కలిసి పెద్దవడుగూరులోని జెసి దివాకర్‌రెడ్డి కళ్యాణ మండపంలో జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకరబాబు అధ్యక్షతన పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా గురువులు చదువులు చెప్పిన తీరు, ప్రస్తుతం ఉన్న పరిస్థితులు అంశాలపై నెమరువేసుకున్నారు. తర్వాత ఒకరినొకరు ఆళింగనం చేసుకుంటూ ఆనందంగా గడిపారు. తర్వాత తమకు చదువు చెప్పిన గురువులను ఘనంగా సత్కరించారు.

ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

గుత్తి : ఎపి ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.ఉషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 7, 8, 9వ తరగతిల్లో రెండు సీట్ల చొప్పున ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఈనెల 5వ తేదీ నుంచి 25వ తేదీలోపు అర్హత ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 29వ తేదీ ప్రవేశ పరీక్ష నిర్వహించి సీట్ల భర్తీకు అర్హులను ఎంపిక చేస్తామన్నారు.

నిత్యావసరాల పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న నిత్యసురభి ట్రస్టు చైర్‌పర్సన్ నిర్మలమురళి

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో పేద మహిళకు రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ నిర్మలమురళి మాట్లాడుతూ స్థానిక నవయుగ కాలనీలో నివసిస్తున్న సుంకమ్మ ఆర్థిక ఇబ్బందుల్లో ఉండగా విషయం తెలుసుకుని రెండు నెలలకు సరిపడ 30 రకాల సరుకులతోపాటు బియ్యం ప్యాకెట్ అందించినట్లు తెలిపారు. ప్రవాస భారతీయులు శ్రీనివాసులు సహకారంతో ఈ సాయం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సౌధామణి, నవయుగ కాలనీ సెక్రటరీ రాజు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం


అన్నదానం చేస్తున్న దృశ్యం

వజ్రకరూరు : ఉరవకొండ మండల పరిధిలోని పెన్నోబిలంలో వెలిసిన ప్రసిద్ధ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కె.కేశవులనాయుడు, కె.సామ్రాజ్యలక్ష్మి అన్నదాన సత్రంలో కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. ఇకముందు కుటుంబ సభ్యులందరూ లక్ష్మీనరసింహస్వామి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్ అశోక్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఇవిఎంల కేంద్రం పరిశీలన


సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న వీరాంజనేయులు

శింగనమల : అనంతపురంలోని జెఎన్‌టియు వర్శిటీలో ఇవిఎంలను భద్రపరచిన కేంద్రాన్ని శింగనమల నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.వీరాంజనేయులు ఆదివారం పరిశీలించారు. ఇందులో భాగంగా ప్రత్యేక గదిలోని ఇవిఎంలు భద్రపరిచిన కేంద్రాన్ని ప్రత్యేక సీసీ కెమెరాల ద్వారా ఏర్పాటు చేసిన తీరును పరిశీలించారు. ఆయన వెంట జడ్పిటిసి భాస్కర్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ట్రాక్టర్ బోల్తా.. ఆరుగురికి గాయాలు


బోల్తా పడిన ట్రాక్టర్

పెద్దవడుగూరు : మండలంలోని కోటకొండ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు గాయపడినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. యాడికి మండలం పుప్పాలతండా గ్రామానికి చెందిన లాలు నాయక్, బంధువులతో కలిసి ట్రాక్టర్‌లో పెద్దవడుగూరు మండలం చిట్టూరు సమీపంలో ఉన్న సుంకులమ్మ ఆలయ వద్ద పూజలు చేయడానికి వచ్చారు. పూజలు ముగించుకుని తిరుగుప్రయాణంలో కోటకొండ సమీపంలోకి రాగానే ట్రాక్టర్ బోల్తా పడింది. దీంతో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే చికిత్స కోసం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో మహిళ పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.